నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్

5 | నిజామాబాద్, సోమవారం 1 ఏప్రిల్ 2024 | ADILABAD




## అభివృద్ధి చేస్తా..

ఎమ్మెల్యే బొజ్జు పటేల్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఉట్నూర్ రూరల్, మార్చి 31 : ఖానాపూర్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం దంతన్‌పెల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధితోపాటు పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నదని అన్నారు. త్వరలో గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## కేటీఆర్‌ను కలిసిన నాయకులు

భైంసా/లోకేశ్వరం, మార్చి 31 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు రమాదేవి, లోలం శ్యాంసుందర్, కిరణ్ కొమ్రేవార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించారు. సమన్వయ కమిటీ సభ్యులుగా నియమించడంపై ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సమన్వయ కమిటీ సభ్యులు

# నౌకరియ్యాలే..

ఒక్కొక్కరు ఐదు ఉద్యోగాలు సాధించారు..

- ఒక్కరూ ఒక్క పోస్టులోనే జాయిన్ అవుతారు..
- మిగిలిన పోస్టులు బ్యాక్‌లాగ్‌గానే ఉండిపోతాయి..
- మెరిట్ ప్రకారం తర్వాత అభ్యర్థులకు చాన్స్ ఇస్తే బాగుంటుంది..
- మళ్లీ నోటిఫికేషన్ వచ్చే వరకు ఏండ్లు పడుతోంది..
- నిబంధనలు మార్చి కాంగ్రెస్ సర్కారు ఆ దిశగా ఆలోచించాలి..
- ఉద్యోగం ఇచ్చి న్యాయం చేయాలని అభ్యర్థుల మనోగతం



### నిబంధనలు మార్చాలి..



ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ కోసం రూపొందించిన నిబంధనలను మార్చితే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుంది. పోటీ పరీక్షలు రాసిన వారిలో ఒక్కపోస్టుకు ఎంపికై మిగతా ఉద్యోగాలు వదిలితే.. ఆ తరువాత మెరిట్ ఉన్న అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేయాలి. ఇలా చేయక పోవడం వల్ల చివరి నిమిషంలో ఉద్యోగం రాని వారు తీవ్ర మనోవేదన చెందుతున్నారు. ప్రభుత్వం అవసరమైతే మంత్రి వర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి, నిబంధనలు సవరించేలా చర్యలు తీసుకోవాలి. ఉద్యోగాలు కల్పించడం ప్రభుత్వం బాధ్యతగా గుర్తించాలి. ఇప్పటికే కొందరు అభ్యర్థులు కోర్టును కూడా ఆశ్రయించారు.

**- వేణుగోపాల్, ప్రైవేట్ అధ్యాపకుడు, నిర్మల్.**

నిర్మల్ టౌన్, మార్చి 31 : గవర్నమెంట్ ఉద్యోగం పొందాలనుకునే వారికి ప్రభుత్వ నిర్ణయం శాపంగా మారుతున్నది. ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అయినా.. గతంలోని నిబంధనలను మార్చకపోవడం నిరుద్యోగులకు శాపంగా మారుతున్నది. కష్టపడి చదివి పీజీలు చేసి ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ కోసం ఏండ్ల తరబడి ఎదురుచూసి పోటీ పరీక్షలు రాస్తే ఉద్యోగాల ఎంపికలో తీవ్ర అన్యాయం జరుగుతున్నదని నిరుద్యోగ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌లను జారీ చేసింది. పోలీసు కొలువులతోపాటు సంక్షేమ గురుకులాల్లో ప్రిన్సిపాల్, ఎస్‌జీటీ, పీజీటీ, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకుల పోస్టులను భర్తీ చేసింది. పోస్టులు కూడా ఎక్కువగా ఉండడంతో ఈసారి ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో అభ్యర్థులు ఇంటిని, కుటుంబ సభ్యులకు దూరంగా ఉండి చదువుకున్నారు. కొందరు కోచింగ్ సెంటర్స్ ద్వారా శిక్షణ తీసుకున్నారు. మరికొందరు స్థానికంగానే స్టడీ మెటీరియల్‌ను కొనుగోలు చేసి చదివారు. గ్రంథాలయాల్లో కూడా పుస్తకాలతో కుస్తీ పట్టారు. ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివి కొందరు నాలుగు నుంచి ఐదు ఉద్యోగాలు సాధించారు. మరికొందరు మెరిట్‌కు దగ్గరగా వచ్చి చేజారి పోయారు. ఉద్యోగాల ఎంపికలో మెరిట్ అభ్యర్థులను ఒక పోస్టుకు ఇద్దరిని ఎంపిక చేసి బోధన సామర్థ్యం ఆధారంగా నియామక పత్రాలను ప్రభుత్వం అందించింది. ఉద్యోగాలు వచ్చిన వారు సంతోషంగా ఉండగా.. చేజారిన వారు నిరాశకు గురవుతున్నారు.

### విద్యార్థులకు నష్టమే..



కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు ప్రకటిస్తుందని నిరుద్యోగులు, యువకులు ఆశతో ఎదురుచూస్తున్నారు. గురుకులాల్లో ఉద్యోగాల భర్తీలో నిబంధనల వల్ల బ్యాక్‌లాగ్ పోస్టులు మిగిలి పోతున్నాయి. దీని వల్ల నిరుద్యోగులకు ఉద్యోగాలు రాక నష్టం వాటిల్లనున్నది. ప్రభుత్వం ఆలోచించి మెరిట్ అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలి.

**- మహేశ్, నిరుద్యోగ అభ్యర్థి, నిర్మల్.**

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లో ఉద్యోగాల నియామక ప్రక్రియ బాగానే ఉన్నా.. నిబంధనలు పాతవి కావడంతో మార్చాలన్నా డిమాండ్‌పై చర్చ జరుగుతున్నది.

### నిబంధనలతో అడియాశలు

కొందరు అభ్యర్థులు టీజీటీని మొదలుకుని అధ్యాపకుని వరకు.. ఇతర ఉద్యోగాలకు కూడా ఎంపికయ్యారు. ఒక్కొక్కరు 3 నుంచి 5 పోస్టులకు ఎంపిక కావడంతో మంచి పోస్టులో చేరి మిగతా పోస్టులను వదులుకున్నారు. ఒక అభ్యర్థి ఒక్క ఉద్యోగానికి మాత్రమే అర్హుడు కావడంతో ఐదు ఉద్యోగాలు సాధించిన వారు మిగతా నాలుగు పోస్టులను వదులుకున్నారు. ఇవి బ్యాక్‌లాగ్ పోస్టులుగానే మిగిలే అవకాశం ఉందని ఉద్యోగాల సాధనలో దరిదాపుల్లోకి వచ్చి వెళ్లిన వారు పేర్కొంటున్నారు. ఈ ఉద్యోగాల భర్తీని పరీక్షలు రాసిన మిగతా మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేసేలా ప్రభుత్వ నిబంధనలను మార్చి తమకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు. కానీ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం భర్తీ కాక మిగిలిన పోస్టులు మళ్లీ భర్తీ చేయాలంటే కొత్త నోటిఫికేషన్ వరకు వేచి చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ నోటిఫికేషన్ రావడానికి ఎన్ని ఏండ్లు పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి హామీ ఇచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనలు మార్చి ఉద్యోగాలు మెరిట్ అభ్యర్థులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.



సారంగాపూర్ మండలం జామ్ గ్రామంలో నీరందక ఎండుతున్న వరి పంట

# కన్నీటి సేద్యం

ఎండుతున్న పంటలు.. పట్టించుకోని పాలకులు

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- నెల రోజుల్లోనే రెండు మీటర్ల లోతుకు..
- ఎత్తిపోతున్న బోరుబావులు
- యాసంగిలో తప్పని నీటి కష్టాలు

నిర్మల్, మార్చి 31(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లావ్యాప్తంగా పంటలు నీరందక ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఒక వైపు మండుటెండలు, మరోవైపు గణనీయంగా పడిపోతున్న భూగర్భ జలాలు రైతును కన్నీటి సేద్యానికి చేరువ చేస్తున్నాయి. పది రోజులుగా నీరందక క్రమంగా ఆయా పంటల రంగు మారుతున్నది. పంటలను పరిశీలించి సూచనలను చేయాల్సిన అధికారులు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలున్నాయి. అలాగే అన్నదాతకు అండగా ఉంటామంటూ ఎమ్మెల్యేలు, అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు చెప్పిన మాటలు నీటిమూటలయ్యాయి. రైతులు సాగునీటి కోసం చేల వద్ద రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు. దీనికి తోడు అడపాదడపా కరెంటు కోతలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగి సీజన్‌లో 1,09,000 ఎకరాల్లో వరి, లక్ష ఎకరాల్లో మక్క పంటను రైతులు సాగు చేస్తున్నారు. జిల్లాలో 68,900 వరకు వ్యవసాయ బోర్లు, బావులు ఉన్నాయి. వాటి కిందనే ఎక్కువ భాగం వరి సాగవుతోంది. అయితే చాలా చోట్ల ఇప్పటికే మక్కపంట చేతికి రాగా, వరి పొట్ట దశలో ఉంది. ఇలాంటి కీలకమైన సమయంలో పంటకు నీరు పుష్కలంగా అవసరం ఉంటుంది. బోర్లలో నీటిమట్టం పడిపోవడంతో పంటలు ఎండుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇతర పంటలకు కూడా ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి.

### పడిపోతున్న భూగర్భ జలాలు..

చాలా ప్రాంతాల్లో భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. గత ఫిబ్రవరి నుంచి మార్చి చివరి నాటికి ఒక్క నెలలోనే రెండు మీటర్ల లోతులోకి నీటి మట్టాలు పడిపోయాయి. గత జనవరి నెలాఖరులో సగటున 7.87 మీటర్ల లోతులో లభ్యమైన నీరు.. ప్రస్తుతం 10.19 మీటర్ల లోతుకు పడిపోయింది. గతేడాది ఇదే సమయంలో 8.72 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండడం గమనార్హం. అంటే గతేడాదికన్నా ప్రస్తుతం 1.47 మీటర్ల కిందికి పడిపోవడం ఆందోళన కలిగిస్తున్నది. కాగా.. గత ఫిబ్రవరి నెలలో 9.11 మీటర్ల సగటు భూగర్భ జలాలు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా సగటున ఒక్క నెలలోనే మీటరుకు పైగా నీటి మట్టాలు పడిపోయాయి. అత్యధికంగా కుంటాల, మామడ, నర్సాపూర్, దిలావర్‌పూర్ మండలాల్లో ఒక్క నెలలోనే రెండు మీటర్ల మేర నీటి మట్టాలు పడిపోయాయి. మండుతున్న ఎండలతో భూగర్భ జలాలు అడుగంటుతుండటంతో సాగునీటి కష్టాలు అధికమయ్యాయి. బోరుబావులు ఎత్తిపోతుండడంతో పంటలకు నీరందించడం కష్టంగా మారుతున్నది. పలు గ్రామాల్లో వందలాది బోర్లు ఎత్తిపోయాయి. నిన్నటి దాకా కళకళలాడిన పంటలు కళ్ల ముందే ఎండిపోవడాన్ని చూసి రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇదిలా ఉంటే కనీసం సరస్వతీ, స్వర్ణ కాలువల కింద వారబందీ అమలు చేసైనా సరే ఆయకట్టు వరకు నీరందేలా చూడాలని రైతులు నీటిపారుదలశాఖ అధికారులను కోరుతున్నారు.

### పట్టించుకోని పాలకులు..

ఎస్సారెస్పీ కింద సరస్వతీ, స్వర్ణ ప్రాజెక్టు కాలువల నుంచి రైతులకు సాగు నీరందించాల్సి ఉండగా, ఆయా కాలువల కింద చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. దీంతో ఈ కాలువల నీటిపైనే ఆధారపడి పంటలు వేసిన రైతుల ఆశలు సన్నగిల్లుతున్నాయి. అలాగే నెల రోజుల నుంచి భూగర్భ జలాల క్రమంగా పడిపోతున్న విషయాన్ని అధికారులు వెల్లడిస్తున్నప్పటికీ వ్యవసాయ, రెవెన్యూ శాఖలు ఈ దిశగా దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తున్నది. పదేళ్ల నుంచి ఏటా కేసీఆర్ ప్రభుత్వం వానకాలం, యాసంగి పంటలలో నీటి యాజమాన్య పద్ధతులపై ముందుగానే రైతులకు అవగాహన కల్పించేది. అలాగే సంబంధిత శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసేది. దీని కారణంగా యాసంగి, వానకాలం సీజన్లలో సాగుకు ఎలాంటి ఆటంకాలు ఎదురు కాలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పట్టించుకోకుండా కేవలం రాజకీయాలకే ప్రాధాన్యతనిస్తుండడంతో సాగు నీటి సమస్య తీవ్రమవుతున్నది.

### వరి కొనుగోళ్లకు రంగం సిద్ధం

యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అయితే క్షేత్రస్థాయి పరిస్థితులను పట్టించుకోకుండా పంటలు ఎండిపోతున్న విషయాన్ని పరిగణలోకి తీసుకుని అధికారులు కొనుగోళ్లపై దృష్టి సారించడం విమర్శలకు తావిస్తున్నది. ప్రాథమికంగా సాగును చివరి వరకు పర్యవేక్షించాల్సిన అధికారులు ఆ దిశగా స్పందించకుండా కొనుగోళ్లు, ఇతర వ్యవహారాలపైనే దృష్టి పెట్టడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వరి చివరి వరకు సాగునీరందితేనే దిగుబడులు వస్తాయని, లేకుంటే ఈసారి యాసంగి సీజన్‌లో దిగుబడులు గణనీయంగా తగ్గిపోయే అవకాశాలు ఉన్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పొలం గట్లపై బబ్బరి

- రెండో పంటతో ఆర్థిక ప్రయోజనం
- ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు..

దస్తురాబాద్, మార్చి 31 : చాలా మంది రైతులు వరి సాగు చేస్తారు. పొలం గట్లపై అంతర పంట వేయాలని అనుకోరు. ఆ పొలాల గట్లపై పిచ్చి మొక్కలు పెరుగుతాయి. ఆ పొలం గట్ల పైన గడ్డి, పిచ్చి మొక్కల పెరగడంతో విష పురుగులు చేరి రైతుకు అపాయం జరిగే అవకాశం ఉంది. తొలగించాలన్న డబ్బు, శ్రమ వృథా అవుతాయి. కానీ.. మండలంలోని రేవోజిపేట గ్రామానికి చెందిన దాదాపు 10 మంది రైతులు నూతన పద్ధతి ద్వారా వరి సాగు చేస్తున్నారు. కొన్నేండ్లుగా పదెకరాల్లో బబ్బరి సాగు చేస్తున్నారు. పొలం గట్లపై బబ్బరను అంతర పంటగా వేస్తూ.. రెండో ఆదాయం పొందుతున్నారు. మార్కెట్‌లో విక్రయించి ఆర్థికంగా ప్రయోజనం పొందుతున్నారు. ఒక్క ఎకరానికి ఆదాయం రూ.5వేల నుంచి రూ.10వేల మధ్యలో వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఈ దిశగా మిగతా రైతులు ఆలోచించి పొలం గట్లపైన అంతర పంటలు వేసుకుంటే శ్రమ, ఖర్చును ఆదా చేసుకోవచ్చు.



పొలం గట్లపైన సాగు చేసిన బబ్బరి

# కేంద్రీయ విద్యాలయం పిలుస్తోంది

- ఒకటో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్
- 2 నుంచి 10వ తరగతి దాకా ఖాళీల భర్తీ
- నేటి నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాల అర్బన్, మార్చి 31 : కేంద్రీయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఒకటో తరగతిలో ప్రవేశాలు, రెండు నుంచి పదో తరగతి దాకా ఖాళీల భర్తీకి కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మానవ వనరుల శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. విద్యా హక్కు చట్టం కింద ఆర్మీ ఉద్యోగులకే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వాటి అనుబంధ సంస్థల ఉద్యోగుల పిల్లలు ఇందులో చేరేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. నేటి నుంచి 15వ తేదీ వరకు ఒకటో తరగతిలో చేరేందుకు, రెండు నుంచి పదో తరగతుల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ఏప్రిల్ ఒకటి నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కేంద్రీయ విద్యాలయం సంఘటన్(కేవీఎస్) నుంచి 64 మంది (సెక్షన్‌కు 32 మంది చొప్పున రెండు సెక్షన్‌లలో) విద్యార్థులను ఎంపిక చేసి ఆ లిస్టును విద్యాలయానికి పంపుతారు. దానిని సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. లిస్టులో ఉన్న వారే తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో విద్యాలయంలో సంప్రదించి అడ్మిషన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంచిర్యాల, ఆదిలాబాద్‌లలో మాత్రమే కేంద్రీయ విద్యాలయాలున్నాయి. దరఖాస్తు చేసుకునేందుకుkvsonlinea dmission. kvg.gov.in లేదా kvssan gathan. nic.in ద్వారా లాగిన్ కావాలి.

### ఉద్యోగుల పిల్లలకే ప్రాధాన్యత...

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, మాజీ సైనికుల పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ రంగ అనుబంధ సంస్థ (బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, బ్యాంకు, పోస్టల్ తదితర) ఉద్యోగుల పిల్లలకు రెండో ప్రాధాన్యత ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మూడో ప్రాధాన్యత, రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థల (ఆర్టీసీ, ఎన్పీడీసీఎల్, తదితర) ఉద్యోగుల పిల్లలకు నాలుగో ప్రాధాన్యత, మిగిలిన వారికి ఐదో ప్రాధాన్యతగా ప్రవేశాలు కల్పిస్తారు. ఇందులో ఎస్సీ కుటుంబాల పిల్లలకు 15 శాతం (5 సీట్లు), ఎస్టీలకు 7.5 శాతం (2 సీట్లు), ఓబీసీలకు 27 శాతం (8 సీట్లు), విభిన్న రంగాలలో ప్రావీణ్యం ఉన్నవారికి (దివ్యాంగులకు) మూడు శాతం సీట్లు కేటాయిస్తారు. జాతీయ విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) నిబంధనల మేరకు ప్రతి తరగతిలో ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాల పిల్లలకు 25 శాతం(8 సీట్లు) ఉచిత బోధన పద్ధతిలో భర్తీ చేస్తారు. లాటరీద్వారా వీరి ఎంపిక ఉంటుంది. ఒకటో తరగతిలో ఆర్‌ఈటీ కింద ప్రవేశం పొందితే పాఠశాల చదువు పూర్తయ్యే దాకా ఉచిత విద్య ఉంటుంది.

### దరఖాస్తుల షెడ్యూల్..

**మొదటి నోటిఫికేషన్ (ఒకటో తరగతి విద్యార్థులకు) :** నేటి ఉదయం 10 గంటల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై ఏప్రిల్ 15న సాయంత్రం 5గంటల వరకు కొనసాగుతోంది. ఒకటో తరగతి ప్రవేశాలకు మొదటి మెరిట్ లిస్ట్ ఏప్రిల్ 19న, సీట్లు ఖాళీ ఉంటే రెండో లిస్ట్ ఏప్రిల్ 29న ఉంటుంది. రెండో లిస్టులో సీట్లు ఖాళీ ఉంటే మూడో మెరిట్ లిస్ట్ మే 8న ఉంటుంది.

**రెండో నోటిఫికేషన్ ( రెండు నుంచి ఇంటర్ విద్యార్థులకు ) :** రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు నేటి నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అదే నెల 15వ తేదీన ఖాళీల లిస్టు ఏర్పాటు చేస్తారు. ఏప్రిల్ 16నుంచి 29వ తేదీ వరకు విద్యార్థుల అడ్మిషన్లు తీసుకుంటారు. ప్రతీ తరగతిలో ఖాళీలను ప్రకటించి నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మెరిట్ జాబితా ఆధారంగా ప్రవేశం ఉంటుంది.

# సత్కరించి.. సాగనంపి..



ప్రత్యేక వాహనంలో ఇంటికి సాగనంపుతున్న ఎస్పీ గౌష్ ఆలం

- ఏఎస్ఐ, ఇద్దరు హెడ్‌కానిస్టేబుల్స్ పదవి విరమణ
- శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలి..
- ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, మార్చి 31 : సుదీర్ఘ కాలంపాటు పోలీసు వ్యవస్థకు సేవలు అందించి, పదవీ విరమణ పొందిన అధికారులను ఘనంగా సత్కరించి.. ప్రత్యేక వాహనంలో ఇంటికి సాగనంపారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ ముఖ్య కార్యాలయంలో పదవీ విరమణ పొందిన అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా ముగ్గురు అధికారులకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులకు పూలమాలతో సత్కరించి, బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అడవుల జిల్లా ఆదిలాబాద్ జిల్లాలో సుదీర్ఘ కాలంపాటు పోలీస్ వ్యవస్థకు చేసిన సేవలు మరవలేనివని గుర్తు చేశారు. ఒకప్పటి పోలీసు వ్యవస్థలోని సిబ్బంది సంఘ విద్రోహశక్తులతో నిరంతరం పోరాడుతూ ప్రశాంతమైన వాతావరణాన్ని సాధించడానికి కృషి చేశారని తెలియజేశారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కుటుంబ సభ్యులతో శేష జీవితాన్ని గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్‌రావు, సీసీ దుర్గం శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సభ్యులు గిన్నెల సత్యనారాయణ, చిందం దేవీదాస్, ప్రజాఫిర్యాదుల విభాగం అధికారి జైస్వాల్ కవిత పాల్గొన్నారు.

## ముమ్మరంగా తనిఖీలు

ఎదులాపురం, మార్చి 31 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. రోజు పట్టణంతోపాటు జిల్లా వ్యాప్తంగా సోదాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. ఈ సమయంలో మాజీ మంత్రి కూడా పోలీసులకు సహకరించారు. అదే విధంగా పంజాచౌక్‌లో తనిఖీల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి వాహనాన్ని టూ టౌన్ పోలీసులు తనిఖీ చేశారు.

ఎదులాపురం, మార్చి 31 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు రైళ్లలోనూ ముమ్మర తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి రైలులో దేశీదారు సరఫరా కాకుండా ఉండడానికి రైల్వే స్టేషన్‌లో ఆదివారం తనిఖీలు నిర్వహిస్తున్నామని డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. ఉదయం విస్తృతంగా తనిఖీలు చేశామన్నారు. ప్రయాణికుల బ్యాగులను నిశితంగా పోలీసులు పరిశీలించారని తెలిపారు. అక్రమంగా మద్యం, నగదు జిల్లాలోకి సరఫరా కాకుండా ఉండేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మహారాష్ట్ర సరిహద్దుల్లోని అన్ని రహదారుల్లోనూ ప్రత్యేక పోలీసు బలగాలతో 24 గంటలపాటు తనిఖీలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.



బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామన్న వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

## కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

- గ్రామాలకు నీరివ్వాలని ఆదేశించినా పట్టించుకోని అధికారులు
- నాలుగు రోజులుగా సరఫరా కాని మిషన్ భగీరథ జలం
- బోర్లలో నీరు ఇంకిపోయి అవస్థలు పడుతున్న గిరిపుత్రులు

తాంసి, మార్చి 31 : మండలంలోని గిరిగామ, అట్నంగూడ, లింగూడ గ్రామాలకు మిషన్ భగీరథ జలం నాలుగు రోజులుగా సరఫరా కావడం లేదు. భూగర్భజలాలు అడుగంటడంతో బోర్లలో నీరు ఇంకిపోయి గిరిపుత్రులు అష్ట కష్టాలు పడుతున్నారు. ఇటీవల తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్ గ్రామస్తులు కలెక్టర్ రాజర్షి షాకు తమ నీటి సమస్యను పరిష్కరించాలని విన్నవించుకున్నారు. కలెక్టర్ సంబంధిత అధికారులకు భగీరథ సమస్యలను పరిష్కరించి అన్ని గ్రామాలకు నీరు అందేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. వారంలో రెండు రోజులు మాత్రమే నీరు వస్తుందని, నీటి కష్టాలను తీర్చాలని అడవిబిడ్డలు వేడుకుంటున్నారు.



అట్నంగూడలో బావి వద్ద నీరు తోడుతున్న మహిళలు